సాక్షి సంగారెడ్డి

గురువారం । 14 । నవంబర్ । 2024



చిచ్చర పిడుగులు

చిన్నారులు కాదు చిచ్చర పిడుగులు. చదువుతో పాటు విభిన్న అంశాలను ఎంచుకొని రాణిస్తూ అందరి మన్నలు పొందుతున్నారు. వివరాలు 8లో ▸



తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం

పోలీస్‌స్టేషన్ ఎదుట తండ్రి, కొడుకులు ఆత్మ హత్యాయత్నం చేసిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలో జరిగింది.

వివరాలు 8లో ▸



ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ స్టేట్ టాస్క్ ఫోర్స్ కమిటీ జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసింది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మూడోరోజు కొనసాగిన క్రీడాపోటీలు



నారాయణఖేడ్: క్రీడాపోటీలను తిలకిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి తదితరులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 10వ జోనల్ 2024–25 స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా 6వ చార్మినార్ జోనల్‌స్థాయి బాలుర క్రీడాపోటీలు మూడవరోజైన బుధవారం కూడా కొనసాగాయి. జోన్ పరిధిలోని 11 గురుకులాల బాలురు పోటీల్లో పాల్గొన్నారు. స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి సందర్శించి క్రీడా పోటీలను తిలకించారు. విద్యతోపాటు క్రీడల ఆవశ్యకతను వివరిస్తూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మూడురోజులపాటు జరిగిన క్రీడలపోటీల్లో విజయం సాధించిన వారిని అభినందించారు. కాగా, బాలలదినోత్సవం సందర్భంగా గురువారం బహుమతుల ప్రదానోత్సవం జరుగనుంది. డీఎస్పీ వెంట స్థానిక గురుకులం ప్రిన్సిపల్ లింగారెడ్డి, 11 గురుకులాల ప్రిన్సిపల్స్, పీడీలు, పీఈటీలు ఉన్నారు.

ఎంఈఓల కు ప్రభుత్వ వాహనం కేటాయించాలి

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ డిమాండ్

పటాన్‌చెరు టౌన్: మండల విద్యాధికారు(ఎంఈఓ)లకు ప్రభుత్వ వాహనం కేటాయించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ డిమాండ్ చేశారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...మండల విద్యాధికారిగా పర్యవేక్షణ బాధ్యతలు, నోడల్ ఆఫీసర్ గా, గ్రామ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎంఈఓ లకు ప్రభుత్వ వాహన సౌకర్యం కల్పించాలన్నారు. ఎంపీడీవోలకు, తహసీల్దార్లకు ప్రభుత్వం వాహన సౌకర్యం ఇతర అలవెన్స్‌లు చెల్లుస్తున్నట్లే ఎంఈఓలకు కూడా అలాంటి సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒకటి జూలై 2023 నుంచి రావాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు ఉచిత హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్



వీక్లీ పరేడ్‌లో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి జోన్: విధి నిర్వహణలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశించారు. సంగారెడ్డి ఎస్పీ కార్యాలయం ఆవరణలోని బుధవారం పరేడ్ గ్రౌండ్స్‌లో ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ పరేడ్ నిర్వహించి, డ్రిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిగత లేదా డ్యూటీ పరంగా ఎలాంటి సమస్యలున్న అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా జిల్లా పోలీసుశాఖ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ నరేందర్, ఆర్.ఐ.లు రాజశేఖర్‌రెడ్డి, డానియెల్, ఆర్.ఎస్ఐలు ఉన్నారు.

ధారూరు జాతరకు పాదయాత్ర

జహీరాబాద్ టౌన్: వికారాబాద్ జిల్లాలో ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్తున్నారు. రాష్ట్ర సరిహద్దు కర్నాటక రాష్ట్రం నుంచి భారీ సంఖ్యలో భక్తులు కాలినడకన ధారూరుకు వస్తున్నారు. జహీరాబాద్–బీదర్ రహదారి పొడవునా బుధవారం పాదయాత్రికులు కనిపించారు. ప్రతి సంవత్సరం ధారూరులో పెద్ద ఎత్తున మెథడిస్టు క్రిస్టియన్ జాతర జరుగుతోంది. కర్నాటక నుంచి భక్తులు కాలినడకన వెళ్లి ఉత్సవాల్లో పాల్గొంటారు. పాదయాత్రలో మహిళలు, పిల్లలు, వృద్ధులు కూడా ఉన్నారు. కాలినడకన వెళ్తున్న భక్తులకు మండలంలోని బూచినెల్లి గ్రామానికి చెందిన ఎ.శ్రీనివాస్ మిత్ర బృందం అన్నదానం చేసి, రాత్రి బస కోసం ఏర్పాట్లు చేశారు.



అన్నదానం చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

వడివడిగా.. మందకొడిగా

- జహీరాబాద్, అమీన్‌పూర్, సదాశివపేటల్లో ఆలస్యంగా..
- కంగ్టి, సంగారెడ్డి, నారాయణఖేడ్ మండలాల్లో 50% దాటిన సర్వే
- ఆధార్, ఇతర గుర్తింపు కార్డులుంటేనే వలస కుటుంబాల వివరాల సేకరణ

గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణాల్లో స్లోగా సర్వే..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పట్టణ ప్రాంతంలో మందకొడిగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే ఆయా మున్సిపాలిటీలో ఈ సర్వే ప్రక్రియ వేగంగా ముందుకు సాగడం లేదు. ప్రధానంగా జహీరాబాద్, అమీన్‌పూర్, సదాశివపేట పట్టణాల్లో మరింత నెమ్మదిగా నడుస్తోంది. అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో బుధవారం వరకు సుమారు 27.7% కుటుంబాల సర్వే పూర్తి అయ్యాయి. జహీరాబాద్ పట్టణంలో కేవలం 12.8%కుటుంబాలు మాత్రమే సర్వే పూర్తయింది. అలాగే అమీన్‌పూర్, సదాశివపేటల్లో కూడా కేవలం 17%లోపే జరిగింది. కంగ్టి మండలంలో 56.2% పూర్తికాగా, సంగారెడ్డి, నారాయణఖేడ్ మండలాల్లో 50%కు మించి సర్వే జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో మొత్తం 4.09 లక్షల కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 1.13 లక్షల కుటుంబాల సర్వే పూర్తయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 82,075 కుటుంబాలకు సంబంధించిన సర్వే పూర్తి కాగా, పట్టణ ప్రాంతంలో 31,709 కుటుంబాల సర్వే పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, కులసర్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 6 నుంచి ఈ సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. ముందుగా ఇంటింటికి వెళ్లి ఆ ఇంట్లో నివాసముండే కుటుంబాల వివరాలతో స్టిక్కరింగ్ చేశారు.



కొన్ని చోట్ల పూర్తి కాని స్టిక్కరింగ్..

సర్వే ప్రక్రియలో భాగంగా ముందుగా ఇంటింటికీ స్టిక్కర్లను అతికిస్తున్న విషయం తెలిసిందే. తొలి రెండు, మూడు రోజులు ఈ ప్రక్రియ కొనసాగింది. ఆ తర్వాత ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టారు. అయితే కొన్నిచోట్ల ఇప్పటికీ స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తి కాలేదు. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో కొన్ని కాలనీల్లోని ఇళ్లకు స్టిక్కర్లు ఇంకా వేయలేదు. మరిచిపోయిన వీధుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి సర్వే చేపడతామని అధికారులు పేర్కొంటున్నారు.

పారిశ్రామికవాడల్లో వలస కార్మికులు..

ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు జిల్లాకు వలస వచ్చారు. బిహార్, ఒడిశా, యూపీ, చత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాల నుంచి వేలల్లో కార్మికులు జిల్లావ్యాప్తంగా ఉన్న పలు పారిశ్రామికవాడల్లో ఉన్న పరిశ్రమల్లో పని చేసేందుకు ఇక్కడికి వచ్చారు. అయితే చాలా ఏళ్లుగా ఇక్కడే ఉంటున్న కార్మికులు, ఉద్యోగులు ఇప్పుడు ఈ సర్వేలో తమ కుటుంబాల వివరాలను నమోదు చేసుకుంటున్నారు. అయితే తాత్కాలికంగా ఉపాధి కోసం వచ్చిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబాల వివరాలు మాత్రం సేకరించడం లేదు. స్థానికంగా నివాసముంటున్నట్లు ఆధార్ కార్డులు ఉన్న కుటుంబాలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు ఉన్న కుటుంబాల వివరాలను మాత్రమే ఎన్యుమరేటర్లు సేకరిస్తున్నారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేని కుటుంబాల వివరాలను ఎన్యుమరేటర్లు తీసుకోవడం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నట్లు సర్వే చేస్తున్న క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పేర్కొంటున్నారు.

పకడ్బందీగా గ్రూప్–3 పరీక్షలు

- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- జిల్లాలో 49 కేంద్రాల్లో పరీక్ష

సంగారెడ్డి జోన్/ హత్నూర : టీజీపీఎస్సీ గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. బుధవారం టీజీపీఎస్సీ గ్రూప్–3 పరీక్షల నిర్వహణపై ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో 15,123 మంది అభ్యర్థులు టీజీపీఎస్సీ గ్రూప్–3 పరీక్ష రాస్తున్నారని వీరి కోసం 49 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 17న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ఉంటుందని తెలిపారు. సాయంత్రం 3.00 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్ 2 హిస్టరీ, పాలిటి అండ్ సొసైటీ పరీక్ష ఉంటుందన్నారు. 18న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8:30 గంటలకే చేరుకోవాలన్నారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులెవరినీ లోపలికి అనుమతించరని స్పష్టం చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవ రావు, జాయింట్ కస్టోడియన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమాచార పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేకు అవసరమైన కుటుంబ సమాచార పత్రాలను అందుబాటులో పెట్టుకుని ప్రజలంతా సహకరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. హత్నూర మండలం పల్పనూరు, చందాపూర్ గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...సర్వే కోసం ఇంటికి వచ్చే అధికారులకు వివరాలు చెప్పాలని కోరారు. కుటుంబానికి సంబంధించిన వివరాలు పొందుపరిచిన అనంతరం కుటుంబసభ్యుల ద్వారా సంతకం తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న, తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఎంపీఈఓ యూసుఫ్, ఏపీఎం దేవేందర్, పలు శాఖల అధికారులు ఉన్నారు.



జహీరాబాద్ ప్రాంతంలో ఓ వెంచర్

తగ్గిన 'రియల్' బూమ్

- పడిపోతున్న ప్లాట్ల అమ్మకాలు
- ఆందోళన చెందుతున్న వ్యాపారులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలో ఏడాది వరకు జోరుగా సాగిన రియల్ బూమ్‌కు బ్రేక్‌లు పడ్డాయి. ఏడాది వరకు జోరుగా సాగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇప్పుడు పూర్తిగా కుదేలైపోయింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ధరణి సమస్యలు, డీటీసీపీ వెంచర్ల అనుమతుల, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కొత్త ఉత్తర్వులకు తోడు ఇటీవలే ప్రభుత్వం మార్కెట్ విలువ పెంచడం వంటి అనేక అంశాలు రియల్ ఎస్టేట్ వ్యాపారంపై తీవ్రం ప్రభావం చూపుతున్నాయంటున్నారు రియల్ వ్యాపారులు. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారం మందకొడిగా సాగుతుండటంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూముల అమ్మకాలు కూడా అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. ఎక్కువ పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేసిన భూములు, ప్లాట్లు అమ్ముకోలేకపోతున్నారు. అమ్మకాలు లేక చలామణి తగ్గి మార్కెట్‌లో డబ్బులు లేకుండా పోతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవడంతో పెట్టుబడులు పెట్టిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

నాడు నిమ్జ్ మంజూరుతో రియల్ జోరు..

జహీరాబాద్ ప్రాంతానికి జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్) మంజూరు కావడంతో గతేడాది వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా జోరుగా సాగింది. నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని 12,635 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మొదటి, రెండు విడతలుగా 5 వేల ఎకరాల వరకు భూమిని సేకరించింది. నిమ్జ్ వల్ల ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద కంపెనీలు వస్తాయని ప్రచారం జరగడంతో భూముల ధరలు రెక్కలు తొడిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను కొనుగోలు చేసి వెంచర్లు వేశారు. ప్రజలు కూడా ప్లాట్లు కొనేందుకు ఆసక్తి చూపడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా సాగింది. జహీరాబాద్ నియోజకవర్గంతోపాటు పట్టణం చుట్టూఉన్న రంజోల్, హుగ్గెల్లి, దిడ్గి, ఖాసీంపూర్, అల్లీపూర్, పస్తాపూర్, హోతి(కె) హోతి(బి), చిన్న హైదరాబాద్, దిడ్గి, కోత్తూర్(బి), అల్గోల్ తదితర గ్రామాల పరిధిలో వందల ఎకరాల్లో పుట్టగొడుగుల్లా వెంచర్లు పుట్టుకొచ్చాయి.

పడిపోతున్న అమ్మకాలు

ప్రభుత్వం మార్కెట్ విలువ పెంచిన తర్వాత ప్లాట్ల అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. ధరణి సమస్యలు, డీటీసీపీ వెంచర్ల అనుమతులు, ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్ చార్జీలు, ల్యాండ్ వ్యాల్యూ పెంపులాంటి కారణాల వల్ల ప్లాట్లు, ఇళ్ల అమ్మకాలు 50% తగ్గిపోయింది. ఫలితంగా రిజిస్ట్రేషన్లు కూడా భారీ తగ్గిపోయాయి. ప్రధాన రహదారుల వెంట కూడా ఏడాది నుంచి క్రయ విక్రయాలు భారీగా తగ్గిపోయాయి. ప్రభుత్వ పెంచిన పన్నుల ప్రభావం రియల్ దందాపై పడిందని వ్యాపారులు చెబుతున్నారు. గుర్తింపు లేని, అనధికారిక లేఅవుట్లలోని ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయవద్దని రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ కమిషనర్ సర్క్యులర్ జారీ చేయడంతో కూడా గుర్తింపు లేని లే అవుట్లలో రిజిస్ట్రేషన్లు ఆగిపోవడం వ్యాపారంపై ప్రభావం చూపుతోంది.

న్యాల్‌కల్ మండలంలోని హత్నూర్, న్యాల్‌కల్, గంగ్వార్, హుసెల్లి, మెటల్‌కుంట, ఝరాసంగం, రాయికోడ్, కోహీర్ మండల పరిధి గ్రామాల్లో ఇప్పటికీ కొత్త కొత్త వెంచర్లు వేస్తూనే ఉన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలన్నీ వెంచర్లుగా మారిపోయాయి. నిమ్జ్ ప్రభావం వల్ల రియల్ ఎస్టేట్ దందా ఊపందుకోవడంతో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి.

కొనడానికి ముందుకు రావడంలేదు

కొన్నేళ్ల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్న వ్యాపారులకు ప్రజలతో మంచి పరిచయాలున్నాయి. గతంలో నెలకు రెండు మూడు ప్లాట్లు అమ్మేవాడిని. ఈ మధ్య మార్కెట్ బాగా స్లో అయిపోయింది. నాలుగైదు నెలల నుంచి ఒకటి రెండు మాత్రమే అమ్మగలిగాను. ప్లాట్‌లు కొనడం కోసం తిరిగే వాళ్లు కూడా ఇప్పుడు రావడంలేదు.

– సతీశ్, రియల్ ఎస్టేట్ ఏజెంట్, జహీరాబాద్

వెంచర్‌లో సర్కార్ భూమి

- పాక్షికంగా ధ్వంసం చేసిన రెవెన్యూ అధికారులు



జేసీబీతో సరిహద్దు రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో సర్వే నంబర్ 1,064లో 48 ప్లాట్లతో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఓ వెంచర్‌లో ప్రభుత్వ భూమి ఉందని రెవెన్యూ అధికారులు గుర్తించి బుధవారం పాక్షికంగా ధ్వంసం చేశారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో బుధవారం రెవెన్యూ యంత్రాంగం ఆ వెంచర్‌లో కొన్ని ప్లాట్ల హద్దురాళ్లను తొలగించారు. వాస్తవానికి 1,064లోని భూమి వాల నారాయణరావుకు చెందిన వివాదాస్పద భూమిగా ఉంది. దాంట్లో మళ్లీ ప్లాట్లు చేసి వెంచర్ వేశారు. ఆ మొత్తం తతంగానికి మంత్రి ఒకరు అండగా నిలుస్తున్నారని చెప్తున్నారు. మంత్రి అనుచరుల నుంచి వస్తున్న ఫోన్లతో అధికారులు హడలిపోతున్నారు. చేసేదేమీలేక వారు చెప్పున్నట్లుగా చేయాల్సి వస్తుందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ప్రారంభించి ప్లాట్లకు హద్దురాళ్లు వేస్తూ రోడ్లు నిర్మిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు స్పందించడంలేదు. ఆ ప్లాట్‌లలో నిర్మాణాలకు కూడా అనుమతులు మంజూరు కావడం విశేషం. స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి పవన్‌ను ఇదే విషయమై వివరణ కోరగా నిబంధనల మేరకు తమకు అందిన దరఖాస్తులను పరిశీలించి అనుమతులిచ్చామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ తహసీల్దార్ ఆదేశాల మేరకు సర్వే నంబర్ 1,064కు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 997కు చెందిన ప్రభుత్వ భూమిని కొంత కలుపుకుని వెంచర్ వేశారని స్పష్టం చేశారు. ఆ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జేసీబీలతో వెంచర్ నిర్వాహకులు వేసిన ప్లాట్లను కొన్నింటిని తొలగించారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం తగదు

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: జీహెచ్ఎంసీ పరిధిభారతీనగర్, రామచంద్రపురం, పటాన్‌చెరు డివిజన్ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ల పరిధిలో చెత్త సేకరణకు వినియోగిస్తున్న వాహనాలు సరిగ్గా పనిచేయడం లేదని తెలిపారు. కాలనీ రహదారుల్లో సేకరించిన చెత్తను తక్షణమే సంబంధిత వాహనాలలో తరలించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 4గంటల నుంచి పారిశుద్ధ్య కార్మికుల విధులు ప్రారంభం కావాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీల్లో సైతం చెత్త సేకరణ చేపట్టాలని సూచించారు.

మినీ స్టేడియంకు మోక్షం ఎప్పుడో!

- పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా పూర్తికాని వైనం
- నైరాశ్యంలో జిన్నారం మండల క్రీడాకారులు

జిన్నారం(పటాన్‌చెరు): క్రీడాకారులు క్రీడల్లో రాణించాలంటే నిత్యం నైపుణ్యాలను పెంచుకుంటూ బలహీనతలను మెరుగుదిద్దుకుంటూ ఉండాలి. అలా నిత్యం ప్రాక్టీస్ చేస్తుంటేనే క్రీడాకారులు తాము ఎంచుకున్న రంగంలో ముందంజవేయగలుగుతారు. అలాంటి క్రీడాకారులకు క్రీడాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం తరపున తగిన ప్రోత్సాహం, మౌలిక వసతులు కల్పిస్తే అద్భుతాలు సాధించగలుగుతారు. వారికి మౌలికవసతుల కల్పనలో కీలకమైనది స్టేడియం. ప్రభుత్వం తరపున స్టేడియాలను నిర్మిస్తే రాష్ట్రం నుంచి ఎంతోమంది వివిధ రకాల క్రీడాకారులను భవిష్యత్తు తారలుగా తీర్చిదిద్దవచ్చు. అలాంటి సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిన్నారం మండల కేంద్ర సమీపంలో మినీ స్టేడియం నిర్మించాలనుకుంది. అయితే నిర్మాణ పనులు ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ప్రభుత్వం మారిపోవడంతో స్టేడియం నిర్మాణం పనులు అటకెక్కాయి. దీంతో తమకు దగ్గర్లోనే ఓ మినీ స్టేడియం వస్తుందనుకున్న క్రీడాకారులు నైరాశ్యంలో మునిగిపోయారు. ఈ ప్రభుత్వమైనా స్టేడియం నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మినీ స్టేడియంకు కేటాయించిన స్థలంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

2022లో ప్రారంభమై నిధుల కోసం చూస్తూ...

జిన్నారం మండల కేంద్ర సమీపంలోని సర్వే నంబర్ 1,002లో మినీ స్టేడియం నిర్మాణానికి ఐదెకరాలను కేటాయించారు. 2022లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్థానిక నాయకులతో కలసి మినీ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మినీ స్టేడియాన్ని అన్ని రంగులతో తీర్చిదిద్దేలా రూ.10 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈ మేరకు స్టేడియంలో రాళ్లను తొలగించి మట్టి పోసి చదును చేశారు. అనంతరం స్టేడియానికి ప్రహరీ గోడ నిర్మించేందుకు మరో రూ.కోటి కేటాయింపులు చేశారు. ఈ పనులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. దాదాపు స్టేడియం పనులు పూర్తి కావొస్తున్న తరుణంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడంతో నిర్మాణ పనులకు బ్రేక్ పడిపోయింది. అప్పట్నుంచీ మినీ స్టేడియం నిర్మాణానికి సంబంధించి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వాస్తవానికి జిన్నారం మండలం నుంచి జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. ప్రభుత్వం నిధులివ్వక ఆగిపోయిన స్టేడియం నిర్మాణ పనుల పట్ల స్థానిక క్రీడాకారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇక మండలానికి చెందిన కొంతమంది ఔత్సాహిక క్రీడాకారులు తమ సొంత డబ్బులు పోగు చేసుకుని మినీ స్టేడియంలో క్రికెట్ పిచ్‌ను కాంక్రీట్‌తో నిర్మించుకుని ప్రాక్టీస్ చేస్తున్నారు. చిన్న చిన్న నాయకుల ప్రోత్సాహంతో వివిధ రకాల క్రీడల టోర్నీలు నిర్వహిస్తూ సాటి క్రీడాకారుల్ని ప్రోత్సహిస్తున్నారు.

నిర్మాణం చూసి మురిసిపోయా...



మినీ స్టేడియం నిర్మాణం ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే మూలన పడింది. స్టేడియం చదును పనులు చూసి ఎంతో ముచ్చటపడ్డాను. తమకు స్టేడియం వస్తుందని మురిసిపోయాను. పనులు ఆగిపోవడం బాధకలిగిస్తోంది. రాజకీయాలు పక్కన బెట్టి స్టేడియాన్ని త్వరగా నిర్మించాలని కోరుతున్నా.

పవన్ క్రీడాకారుడు, జిన్నారం

అసంపూర్తి స్టేడియంలోనే ఆడుతున్నాం



మండలంలో ఎంతోమంది క్రీడాకారులున్నారు. ప్రతి ఒక్కరి కల మినీ స్టేడియం ఏర్పాటవుతుంటే సంతోషం కలిగింది. ఎక్కడి పనులు అక్కడి ఆగిపోయాయి. సెలవు సమయాల్లో అసంపూర్తిగా నిర్మించిన స్టేడియంలోనే ఇప్పుడు క్రికెట్ ఆడుతున్నాం. మా ఆసక్తిని చూసైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

చందు, క్రీడాకారుడు, నల్తూర్

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయడంతోపాటు కొత్త రుణాల కోసం షెడ్యూల్ ప్రకటించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో జరిగిన కేవీపీఎస్ కార్యకర్తల సమావేశం అశోక్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు చేసుకున్నారని, అవి ఇప్పటివరకు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వం దళితబంధు అమలు చేస్తున్నామని చెప్పి కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా అంబేడ్కర్ అభయహస్తం పేరుతో దళిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.12లక్షలు ఇస్తామని చెప్పిందని కానీ ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. గతంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు న్యాయవాది సుభాష్, ఎం.శివ కుమార్, జిల్లా కమిటీ బి.దత్తు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పని కోసం వెళ్లి అనంతలోకాలకు

అదుపు తప్పిన బైక్.. యువకుడి మృతి


తిరుపతిరెడ్డి(ఫైల్)

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కొల్గూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్‌కు చెందిన పీ తిరుపతిరెడ్డి (38)కి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. బుధవారం తన సొంత పని నిమిత్తం బైక్‌పై గజ్వేల్‌కు వస్తున్నాడు. మార్గ మధ్యలో కొల్గూరు గ్రామ శివారు.. మలుపు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

ఇద్దరు దొంగలకు మూడేళ్ల జైలు

కొండపాక(గజ్వేల్): దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారణైన ఇద్దరు దొంగలకు 3 సంవత్సరాల జైలు శిక్షను విధిస్తూ సిద్దిపేట కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పు చెప్పారని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా బీబీనాయక్ తండాకు చెందిన రాథోడ్ అలియాస్ నరేశ్, బలరాం కొంతకాలంగా పలు చోట్ల తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించుకొని రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఇదే క్రమంలో కుకునూరుపల్లి స్టేషన్ పరిధిలో 8 నెలల కిందట కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, కొడకండ్ల, కుకునూరుపల్లిల్లోని పలు ఇళ్లల్లో దొంగతనాలు చేశారన్నారు. ఈ మేరకు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారన్నారు. కోర్టులో జరిగిన విచారణలో వీరిద్దరే చోరీలు చేసినట్లుగా నిర్ధారణ కావడంతో మెజిస్ట్రేట్ ఈ కేసులో పై తీర్పునిచ్చారని తెలిపారు. నిందితులకు శిక్షపడేలా పని చేసిన సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్, కోర్టు పోలీస్ కానిస్టేబుల్ లోకేశ్‌లతో పాటు మరికొందరిని అభినందించారు.

హైనా దాడిలో దూడ మృతి



చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో దూడ మృతిచెందిన ఘటన చిన్నకోడూరులో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రాపోలు సత్తిరెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద రోజూ మాదిరిగా దూడను కట్టేశాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లగా దూడ మృతిచెంది కనిపించింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ అక్కడకు చేరుకుని హైనా దాడిలో దూడ మృతి చెందినట్లు నిర్ధారించారు. గ్రామ రైతులు అప్రమత్తంగా ఉండాలని, కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవ్వరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

చిరుత కోసం బోన్ ఏర్పాటు


అనుమానిత ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోను

సిద్దిపేటఅర్బన్: చిరుత తన పిల్లలతో కలిసి సంచరించిన ప్రాంతంలో పాదముద్రల ఆనవాళ్లు గుర్తించేందుకు బుధవారం ఫారెస్టు అధికారులు గాలించారు. మండలంలోని బూరుగుపల్లిలో ఉన్న వ్యవసాయ బావుల వద్ద చిరుత తన పిల్లలతో కలిసి సంచరించిందనే సమాచారం మంగళవారం కలకలం రేపిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడక్కడ ఉన్న పాదముద్రల కొలతలు సేకరించారు. చిరుత పాద ముద్రల గుర్తులతో వాటిని విశ్లేషించి చూశారు అవి చిరుత పాదముద్రలా? కాదా? అని నిర్ధారణ కావడం లేదని, అనుమానిత ప్రాంతంలో పాడి మట్టి ఉండటం వల్ల గుర్తులు సరిగా లభ్యం కావడం లేదని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇక్రముద్దీన్ తెలిపారు. చిరుత కోసం ఆ ప్రాంతంలో బోను, ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పులి సంచరించే విషయం పూర్తిగా నిర్ధారణయ్యే వరకు గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్ఓ పద్మ, బీట్ ఆఫీసర్ చైతన్య, ఇతర అధికారులు ఉన్నారు.

చిన్నారులు కాదు చిచ్చర పిడుగులు

విభిన్న అంశాల్లో రాణిస్తున్న బాలబాలికలు | నేడు బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేకం



వారు చిచ్చర పిడుగులు. చదువుతో పాటు విభిన్న అంశాలను ఎంచుకొని రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. తమ ప్రతిభను ప్రదర్శించి పలు వేదికల్లో పతకాలను పట్టారు. సాంకేతికతను అందిపుచ్చుకొని.. నెట్టింట రీల్స్ చేస్తూ ఫాలోవర్స్‌ను మైమరిపిస్తున్నారు. అంగవైకల్యం కూడా అభివృద్ధికి అడ్డు కాదంటూ రంగుల లోకంలో తమకంటూ ప్రపంచాన్ని సృష్టించుకుంటున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు.


హరి ప్రసాద్


నాగేశ్వరి

పంచ్ పడితే పతకమే

జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్, ఉషు విభాగంలో ఎంపిక

హత్నూర(సంగారెడ్డి): జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్, ఉషు విభాగంలో హత్నూర మండలం సిరిపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి మద్దూరి హరిప్రసాద్, ఎనిమిదో తరగతి విద్యార్థిని కాలే నాగేశ్వరి ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 4 వరకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–19 ఫైటింగ్ విభాగంలో హరిప్రసాద్ బంగారు పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 9, 10 తేదీల్లో రంగారెడ్డి జిల్లా హస్తినాపూర్‌లో జరిగిన ఉషు అండర్–14 విభాగం రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో నాగేశ్వరి విజేతగా నిలిచింది. దీంతో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఇదే నెలలో పంజాబ్‌లో జరిగే పోటీలో కాలే నాగేశ్వరి, డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగే పోటీల్లో హరి పాల్గొననున్నారు.

యోగాసనాలు సునాయసంగా..


యోగాసనంలో సుమతి

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సుమతి. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాలనే బలమైన కోరికతో యోగా వైపు అడుగులు వేసేలా చేసింది. హిందీ మాస్టర్ విజయ్‌కుమార్ స్ఫూర్తితో ఆరవ తరగతి నుంచే రోజూ సాయంత్రం గంట వరకు యోగా సాధన చేస్తోంది. ప్రతీ వేసవి సెలవులలోనూ ఈ పాఠశాలలో యోగా ఉచిత క్యాంపు నిర్వహిస్తారు. దీంతో ఎంతటి కఠినమైన ఆసనాలను కూడా అవలీలగా వేస్తూ అందరితో ప్రశంసలు అందుకుంటుంది. ఈ నెల రెండో తేదీన అండర్ 17 విభాగంలో జరిగిన జిల్లా యోగా పోటీలో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ నెలలో 6, 7, 8వ తేదీల్లో వరంగల్‌లో జరిగే పోటీల్లో పాల్గొని అక్కడ కూడా సత్తా చాటి జాతీయస్థాయికి ఎంపికైంది. యోగాను ఒలింపిక్‌లో ప్రవేశపెడితే భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి దేశానికి గోల్డ్ మెడల్ సాధించి అమ్మ నాన్నలతో పాటు గ్రామానికి, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఉందని సాక్షితో వెల్లడించింది.

డ్యాన్స్ ఇరగదీస్తూ.. వేషధారణలో మెప్పిస్తూ ..


లవకుశ వేషాధారణలో


కూచిపూడి నాట్యం చేస్తున్న సహస్ర

దుబ్బాకటౌన్: చిన్న వయస్సు కళలతో మెప్పిస్తూ..ముందుకు సాగుతున్నారు. దుబ్బాక పట్టణానికి చెందిన 9 సంవత్సరాల వంగ సహస్ర... డ్యాన్స్ పోటీల్లో సత్తా చాటుతుంది. వెస్టర్న్.. క్లాసికల్ డ్యాన్స్‌లో భరత నాట్యం, కూచిపూడి నాట్యంలో సైతం ప్రతిభ కనబరుస్తుంది. జిల్లాలో నిర్వహించిన పలు పోటీలలో సత్తాచాటి పథకాలు గెలుచుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ సరస్వతి, లవకుశ , దుర్గ మాత, పార్వతి వేషధారణలో మెప్పిస్తుంది.

అడుగే ఆట.. నడకే నృత్యం


మెదక్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్‌లో శ్రీజ

పాపన్నపేట(మెదక్): మండలంలోని యూసుఫ్‌పేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది కోమలంచ శ్రీజ. ఇటు చదువుల్లోను.. అటు నృత్యం లోను మేటి కళాకారిణిగా రాణిస్తోంది. పాఠశాల టీచర్ పద్మ ప్రోత్సాహంతో తన ప్రతిభకు మెరుగులు దిద్దుకుంది. పాఠశాల స్థాయిలో ఎక్కడ సాంస్కృతిక పోటీలు జరిగినా తప్పకుండా పాల్గొని బహుమతి సాధిస్తుంది. ఇటీవల మెదక్‌లో జరిగిన యూత్ ఫెస్టివెల్ జిల్లా స్థాయి జానపద నృత్య పోటీల్లో ప్రథమ స్థానం పొందింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో సైతం తన డ్యాన్సుతో అదర గొట్టింది.

బుడ్డోడు.. కరాటేలో గట్టోడు


కరాటేలో విన్యాసం చేస్తున్న శ్రేయన్స్

దుబ్బాకటౌన్: ఆరు సంవత్సరాల వయసులోనే ... బుడ్డోడు కరాటేలో ప్రతిభ చూపుతున్నాడు. దుబ్బాక పట్టణానికి చెందిన శ్రేయన్స్ ఋషి విద్యాలయంలో యూకేజీ చదువుతున్నాడు. కరాటే పై ఇష్టంతో మాస్టర్ బురాని శ్రీకాంత్ వద్ద విద్య నేర్చుకుంటున్నాడు. వయసును లెక్క చేయకుండా కరాటేలో లెగ్ స్ట్రెచ్, ఫ్రంట్ కిక్, స్ట్రెయిట్ కిక్ , సైడ్ కిక్ ఇలా పలు విన్యాసాలు చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నాడు. జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్‌లో పాల్గొంటున్నాడు.

సోదితో మెప్పించి.. బహుమతి సాధించి


విచిత్ర వేషధారణలో హర్షిత

చిన్నశంకరంపేట(మెదక్): సోది చెబుతానమ్మ సోది చెబుతానంటూ... కథల పోటీలలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. చిన్నశంకరంపేట మండలం రుద్రారానికి చెందిన హర్షిత. చందంపేట ఉన్నత పాఠశాల పదవ తరగతి చదువుతోంది. రెండు రోజుల పాటు హైదారాబాద్‌లో నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో యువతపై మాదకద్రవ్యాల ప్రభావం–నివారణ కోసం పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రహరీ క్లబ్‌ల ఆవశ్యకత, జీవన నైపుణ్యాలను మెరుగు అనే అంశాలపై సోది చెప్పింది. స్టోరీ టెల్లింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటి జాతీయస్థాయికి ఎంపికైంది.

రీల్స్‌తో.. రప్ఫాడిస్తున్న శివరాంసాయి



సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణానికి చెందిన 12 ఏళ్ల శివరాంసాయి. స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. గతేడాదిన్నరగా సోషల్ మీడియాలో సిద్దిపేట చిచ్చా పేరిట శివరాంసాయి తన రీల్స్ ద్వారా ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటి వరకు ఇన్‌స్టాలో సిద్దిపేట చినోళ్లు పేజీ పేరిట చేస్తున్న రీల్స్‌కు 30 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. యూట్యూబ్‌లోను ఆదరణ ఉంది. సిద్దిపేట పట్టణంలో వ్యాపార, వాణిజ్య సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా రీల్స్ చేస్తున్నాడు. హోటల్స్, బిర్యానీ పాయింట్లు, షాపింగ్ మాల్స్, వివిధ రకాల దుకాణాలకు తన రిల్స్ ద్వారా ప్రకటనలు చేస్తున్నాడు.

గ్లోబల్ స్థాయిలో సత్తా



జిన్నారం (పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలో బొల్లారం మున్సిపల్ పరిధిలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న గవ్వర లాస్య విశ్వవేదికపై మెరిసింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం గురువుల మార్గదర్శకత్వంలో గత నెలలో జరిగిన ఇంటర్ జనరేషన్ గ్లోబల్ ఈవెంట్ నాలెడ్జి కేఫ్ 2024 ఎంపికై అందరి ప్రశంసలు అందుకుంది. విశ్వ వేదికపై వర్చువల్ గా నిర్వహించిన ఐదు దేశాల విద్యార్థులతో పోటీపడి సత్తా చాటింది. 120 నిమిషాల పాటు మూడు రౌండ్లలో మేథో ప్రతిభ కనబరిచింది.

చిత్రలేఖనానికి... చిన్నబోయిన వైకల్యం


వివేకవర్ధిని

దుబ్బాకటౌన్: అంగవైకల్యం ప్రతిభకు అడ్డు రాదని నిరూపించింది దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన కోమటిరెడ్డి వివేకావర్ధిని. చిత్రలేఖనంలో రాణిస్తూ అందరితో శభాష్ అనిపించుకుంటుంది. దుబ్బాక మున్సిపల్ లచ్చపేటలో 10 వ తరగతి చదువుతోంది. ఒంటి చేతితోనే అందమైన బొమ్మలను గీస్తూ సామాజిక సందేశాన్ని అందిస్తోంది. పుట్టుకతోనే ఒక చేయి లేదు. అయినా మొక్కవొని మనోధైర్యంతో కుంచెతో సమాజంలోని రుగ్మతలపై బొమ్మలు వేసి జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. కేంద్ర ప్రభుత్వం యేటా నిర్వహించే కళోత్సవ్‌లో గీసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

శిశు సంరక్షణకే ప్రాధాన్యం



సంగారెడ్డిజోన్: బాలల హక్కుల కోసం సంరక్షణ కేంద్రాలు వారి రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. జిల్లాలో ఉన్న అనాధ పిల్లలు, నిరాధారణకు గురైన పిల్లలను శిశు గృహ, బాలసదనాల ద్వారా సంరక్షణ చర్యలు చేపట్టింది. గుర్తు తెలియని 6 సంవత్సరాల లోపు శిశువుల సమాచారం తెలిస్తే వెంటనే బాలరక్షక్ వాహనాల ద్వారా వెళ్లి రిస్క్యూ చేస్తున్నాం. ఏడు నుంచి 18 సంవత్సరాల వయసు లోపు ఉన్న నిరాధారణకు గురైన అనాధ బాలలకు రక్షణ, భద్రత కోసం బాలసదనానికి పంపిస్తున్నాం. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు 11 మంది రెస్క్యూ చేశాం . 18 మందిని దత్తత ఇచ్చాం.

–లలిత కుమారి, జిల్లా మాతా శిశు సంరక్షణ శాఖ అధికారి

బాలకార్మికుల వ్యవస్థను రూపుమాపుదాం



సంగారెడ్డిటౌన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరిపై ఉంది. బాలల దినోత్సవం అంటే కేవలం వేడుక చేసుకోవడమే కాదు కాకుండా పిల్లలకు విలువల గురించి తెలియజెప్పాలి. వారితో పని చేయిస్తే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పిల్లలు ఆటపాటలతో పాటు చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగాయి. పిల్లలు సెల్ ఫోన్లు ఎక్కువగా వాడుతున్నారు ఈక్రమంలో సైబర్ నేరాలపై అవగాహన అవసరం. పిల్లలు, పెద్దలకు ఎవరికైనా మా వంతుగా ఉచిత న్యాయ సహాయం, సలహాలను అందజేస్తాం.

–రమేశ్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి

తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం

- చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుటే డీజిల్ పోసుకున్న పరిస్థితి
- తేరుకొని అడ్డుకున్న పోలీసులు
- భూమి తగాదా విషయమై పలుమార్లు పిలిపించిన ఎస్ఐ
- పూర్వీకుల ఆస్తి విషయమై అన్న యాదయ్య ఫిర్యాదు


ఆత్మహత్యాయత్నం చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): పోలీస్‌స్టేషన్ ఎదుట తండ్రి, కొడుకులు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలో బుధవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన తండ్రీకొడుకులు అవుశర్ల సత్యనారాయణ, అవుశర్ల వెంకటేశ్‌లు తమ పూర్వీకుల నుంచి సంక్రమించాల్సిన భూమికి సంబంధించి తలెత్తిన తగాదా విషయంలో అధికార పార్టీ నాయకులు కలుగజేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు రప్పించి కేసులు నమోదు చేయిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయమై తీవ్ర మనస్తాపం చెంది పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై డీజిల్ పోసుకున్నారు. వెంటనే తేరుకున్న పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి విడిలిపెట్టారు. ఈ విషయమై ఎస్ఐ నీరేష్‌ను వివరణ కోరగా.. సత్యనారాయణ అన్న అవుశర్ల యాదయ్య ఈ నెల 11న ఫిర్యాదు ఇచ్చాడన్నారు. ఈ విషయమై మాట్లాడెందుకు సత్యనారాయణ, వెంకటేష్‌లను స్టేషన్‌కు పిలిచానన్నారు. మాట్లాడిన అనంతరం భూ తగాదాలు సివిల్ కోర్టులో తేల్చుకోవాలని, ఒకరి భూమిలోకి మరొకరు వెళ్లి తప్పు చేస్తే కేసు నమోదు చేయాల్సి వస్తుందని చెప్పి పంపించానన్నారు. కానీ వారు స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. ఇందులో పోలీసుల ప్రమేయం ఏమీ లేదన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బానోతు రాజన్న

- 20 మంది విద్యార్థులకు ఒక కేర్ టేకర్, ప్రత్యేక స్టడీ అవర్స్
- జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న
- విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్పొరేట్‌కు దీటుగా విద్యబోధన అందిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న అన్నారు. జగదేవపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని చెప్పారు. ప్రత్యేక తరగతులు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని, వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శద్ధ వహిస్తున్నామని తెలిపారు. ఎంసెట్ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక కేర్ టేకర్ ఉంటారని, వారి బాగోగులను చూసుకుంటారన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులుగా కూడా శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం సమాజంలో అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని ఇంటర్‌లోనే సరైనా మార్గం ఎంచుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ఉద్ఘాటించారు. ఇంటర్‌లో జాగ్రత్తగా చదివి పాసైన వారు ఉన్నత చదువులు చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలు దగ్గర్లో ఉన్నాయని, వారిని దగ్గరుండి చదివించాలని, మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. సమావేశంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొనాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను, కళాశాల బృందాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

చెట్లపొదల్లో పసికందు

- దుద్దెడ శివారులో హృదయవిదారకర ఘటన
- మాజీ సర్పంచ్ చొరవతో ఆస్పత్రికి తరలింపు


పసిబిడ్డను ప్రభుత్వ ఆస్పత్రిలో అప్పగిస్తున్న 108 సిబ్బంది

కొండపాక(గజ్వేల్): పుట్టిన బిడ్డను కవర్లో కట్టి చెట్ల పొదల్లో వదిలివేసిన హృదయ విదారకర ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ శివారులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుద్దెడ నుంచి దర్గా గ్రామానికి వెళ్లే దారిలో చెట్ల పొదల మధ్య పసికందు ఏడుపులను ఈ ప్రాంతంలోని పశువులను మేపుతున్న కాపరులు విన్నారు. గ్రామస్తులకు సమాచారం అందించగా మాజీ సర్పంచ్ మహాదేవ్‌తో పాటు దరు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పసికందు చెట్ల పొదల్లోంచి బయటకు తీసి ముక్కు కింది భాగంలో రక్తం కారుతుండటంతో శుభ్రం చేశారు. అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మహేందర్, రమేశ్‌లు కాల్ సెంటర్ ద్వారా వైద్యుడి సలహాల మేరకు శిశువుకు ప్రథమ చికిత్స అందించారు. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి డ్యూటీ వైద్యురాలు గ్రీష్మకు అప్పగించినట్లు అంబులెన్సు సిబ్బంది పేర్కొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

పటాన్‌చెరు టౌన్: ఎండు గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం... పటాన్‌చెరు మండలం ఘనాపూర్‌లో, పటాన్‌చెరులో ఉన్న వాల్యూ జోన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం బుధవారం ఎక్సైజ్ పోలీసులకు అందింది. దీంతో తనిఖీలు నిర్వహించి ఘనపూర్‌లో ముగ్గురు, పటాన్‌చెరులో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6.03 కిలోల ఎండు గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.